# బానిసల దేశం

"ఇన్నావంటే" తలుపులమ్మ కూతురు నరిసీని, మొగుడొదిలేసినాడంట! ఆడి జిమ్మడ— ఆడికేం పోగాల మొచ్చిందోగాని..."

అనే మాటలు వినిపిస్తే తలెత్తి చూశాను. తొడల దాకా విరిచికట్టిన చాలీచాలని గుడ్డలతో, ఎంతో అసహ్యంగా ఉన్నారు వాళ్ళు; ఉమ్మితో నానిపోయిన చుట్టల్ని బలవంతంగా కాలుస్తున్నారు; చుట్టపొగ దుర్వాసనగా మారి, నాశికాత్రియంబకాన్ని ముక్కలుగా ఛేదిస్తూంది. తలుపుల వరకూ తనాయించి కూర్చున్నారు. కూర్చున్న ప్రక్కనే కాండ్రించి ఉమ్ముతూ బండిని ఖరాబుచేస్తున్నారు.

ఎత్తినబుర్ర తిప్పుకొని మళ్ళీ 'డెత్ పిట్సు' చదువుతున్నా. కాని మెదడులో కొంతభాగం— నరిసిని మొగుడు విడిచిపెట్టడానికి గల కారణాన్ని వెదుకుతోంది. మన సమాజంలో భర్తలు భార్యల్ని వదిలేసేందుకుగల కారణాల్ని, ఆలోచించి తెల్సుకోవడం ఏమంత దుస్సాధ్యమూ కాదు కనక తృప్తిపొందాను. మనవు వున్నవాళ్ళే కాబట్టి ఫరవాలేదనే ధీమాతో సమాధానపడ్డాను.

సామర్లకోట వదిలేస్తున్నా అంటూ అరుస్తోంది రైలు. గబగబా వెళ్ళిపోతూంది రైలు. బాహ్యాంతరాల్లో కలుగుతున్న విలక్షణశబ్దాలు వింటూ, పుస్తకం చదువుతున్నాను. చుట్టూవున్న పరిసరాల్ని చూసీ చూడనట్టు తప్పించుకుని పారిపోవడం ఎంత కష్టం?

"ఎయ్ రాకు— ఏ, కాళీలేక చస్తూంటే, పోవేం?" అంటున్న మాటల గర్జనలు వినిపించాయి. తలెత్తి చూసే లోపలే ఆ మాటలు నిరుపయోగమయ్యాయి. రైలు కిటికీనుంచి దూరి లోపలి కొచ్చేసిందో ముష్టిపిల్ల.. అలాగే చూస్తున్నాను దాన్ని తదేకదీక్షతో...ప్రారంభించింది— "బాబూ— మము బీదలమూ అనాథులమూ కరుణించరే!" అంటూ పాట

బొద్దుగా చామన చాయగా అందంగానే ఉంది. తగిన సంస్కారం ఉంటే... ఎలా ఉంటుంది? బానిసల దేశంలో

వాళ్ళ జీవితాలకి సంస్కారం ఎలా వస్తుంది? సున్నగా పొట్టిగా ఉంది; దింపిరితల పాటకి గాలిలో నాట్యం చేస్తోంది. తోళ్ళలా మాసిపోయిన చిరుగు గుడ్డలు— కొంచం దూరంలోనే ఉంది నాకు— అయినా కంపుకొడుతూనే ఉన్నాయి.

అనేకసార్లు అనేకమంది ముష్టిపిల్లలు పాడుతుండగా ఈపాట విన్నాను. విసుక్కున్నాను. అందరికీ ఒకేపాట ట్రెయినింగ్ ఇచ్చే ఏదైనా కంపెనీ లేదుకదా అని అనుమానించాను. ఆలోచించాను. ఈ పిల్లలో ఏముంది? అలాగే వింటున్నాను రెప్ప వాల్చకుండా. స్వతస్సిద్ధంగా సన్ననికంఠం— ఎన్నోసార్లు పాడ్డంమూలాన గొంతు పగిలి జీరవచ్చింది. కాని పాట బాగానే ఉందనిపించింది.

శుష్కంగా, వ్యర్థంగా, ప్రయత్నిస్తోంది; అందరి హృదయాల్లోకి చేతులు చాపుతోంది; నిరాశగా నావంక నడిచివస్తోంది; బాధలు జయించిన సహజమైన పెంకితనం జాలితనంగా మారిందా ముఖంలో, కనురెప్పల్లోంచి నిరాశ జారుతోంది. సున్నని పొట్టబుగ్గల్లోంచి తనకూ నాకూ కూడా తెలీని శక్తి తొంగిచూస్తోంది. నన్ను లొంగతీసి, అణా ఇచ్చేట్టు చేసింది.

కన్యాత్వంలోంచి అప్పుడే బైటకు వస్తున్న ఆమె శరీర సౌష్ఠవం, మాసి యిరుకుగా ఉన్న చిరుగుల జాకెట్టులోంచి కోలగా, పెంకిగా పైకి చూస్తోంది. అందమైన సోగకన్నులు

తెల్లని అణాకేసీ చూసుకుంటున్నాయి. మెరుస్తున్నాయి. తనవంకే దృష్టి మరల్చకుండా చూస్తున్న నన్ను గ్రహించింది. కొంచెం సిగ్గుపడింది. అలాగే నుంచుంది.

"ఏవూరు అమ్మాయి మీది?" ప్రశ్నించాను.

"మాకో వూరేటండీ. యిలాగే తిరుగుతూంటాం!" అంది నిబ్బరంగా.

"అది సరే నీ కెవరూలేరు మరి?" మళ్ళీ అడిగాను.

"ద్వారపూడిలో వున్నారండి. మా అప్పా ఆళ్ళూను" అంది.

నేనేమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచన... వాళ్ళ జీవితాల గురించి... చాలా రోజుల్నుంచి అనుమానిస్తున్న విషయం పరిశోధించి తెల్సుకోవాలి– ఏవో నిశ్చయాలు.

"మీరే యూరెడతారండీ" ఆప్యాయంగా అడిగింది.

"నేనూ ద్వారపూడే" అనేశాను. రాజమండ్రి టిక్కెట్టు చూసుకున్నాను. ఎందుకలా అన్నాను? ప్రశ్నించుకున్నాను. తెలియలేదుకాని నాలోని అంతర్భాగం పరిశోధనా కార్యక్రమాని కుపక్రమించడం వాస్తవం.

మూడోక్లాసుపెట్టె రణగొణ ధ్వనితో నిండిపోయింది. అల్లకల్లోలం వ్యాపించి అల్లుకుపోతోంది. మా యిద్దరిమధ్యా మాత్రం క్షణం నిశ్శబ్దం.

* * *

పొగ చూరిన వాళ్ళజీవితాలకి నా ఊహలు కొలత బద్దలు. లోకంలో పేదవాళ్ళ జీవితాలకి అసమ వ్యవస్థపట్టించిన పొగకి తనూ శక్తి వంచన లేకుండా సహకరిస్తునేఉంది రైలు. కొంటెగాచూస్తు నిప్పురవ్వల నిట్టూర్పులు విడుస్తూనిర్లక్ష్యంగా నడుస్తు వెళ్ళిపోతూనేఉంది రైలు.

'డెత్ పిట్స్' చదవాలి. నిర్ణయించుకున్నాను. ఎన్నో మార్లు ప్రయత్నించాను. విఫలుణ్ణయ్యాను. వీల్లేదనే శాసనాలు—నాలోని తపనికి నాపై అధికారం. 'ఆమెను గురించి తెలుసుకోవాలి. వాళ్ళజీవిత రహస్యాల్ని పరిశోధించాలి? 'అన్నాడు నాలోని జిజ్ఞాసువు' ప్రయత్నించాలి — పరిష్కార మార్గం యోచించాలి. తప్పౌతుందా? మానవుణ్ణి, అనుకున్నాడు నా లోపలి వివేకి.

భారత కార్మికుల దుర్భరస్థితిని కళ్ళారాచూపుతోంది 'డెత్ పిట్స్' —'డాంగేమహాశయుడు ఎంతస్పష్టంగా, నిష్కర్షగా వివరించి, విమర్శించాడు' అన్నాడు నాలోని విమర్శకుడు.

కార్మికుల బ్రతుకుమీంచి కసిగా నడిచిపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ లాగుంది రైలు. విహ్వాటంగా, ఠీవిగా, విక్టోరియా మహారాణిలా వూగుతూ పోతోంది రైలు.

అందరి ముఖాలు వెదుకుతోంది ముష్టిపిల్ల; అదృష్టాన్ని శోధిస్తోంది; కరుణకోసం నిరీక్షిస్తోంది; ఆమెకి డబ్బులిచ్చిన వాళ్ళకంటె తిట్లను పంచిపెట్టిన దయార్ద్ర హృదయుల సంఖ్య

హెచ్చడంలో అన్యాయంలేదు!—"వెధవ ముష్టి బ్రదుకులు! పనిపాటలు చేసుకోగూడదూ?" అన్నాడొక పింఛనీ పుచ్చుకున్న గుమాస్తా.

నాకు 'జెట్‌పీట్సు' జ్ఞాపకంవచ్చింది. రక్తమాంసాలర్పిస్తూ, ఆనందాన్ని తర్పణచేస్తూ సూర్యుడి జాతకచక్రానికి తమ జీవితాల్ని కట్టేసుకున్నా రోజులు గడవని కార్మికుల శవాలు వికటంగా నవ్వాయి.

ద్వారపూడి స్టేషన్లో ఆగిందిరైలు. హడావుడిగా దిగిపోయింది ముష్టిపిల్ల, నేనూ సంచీ తీసుకున్నాను. గుమ్మందగ్గర నించున్నాను. చూస్తున్నాను. తర్కించు కుంటున్నాను.

జనాన్ని దింపేసింది. జనాన్ని ఎక్కించుకున్నది. తనపని పూర్తిచేసుకుంది రైలు.

ముష్టిపిల్ల ప్లాట్‌ఫారంమీద తచ్చాడుతోంది. దయామయుల చూపుల్లోకి చేతులు చాపుతోంది. "బాబూధర్మం" దీనంగా ప్రార్థిస్తోంది ముష్టిపిల్ల. మళ్ళీ రైలెక్కే ఉద్దేశం లేదామెకు. గ్రహించాను. స్టేషన్ కవతలి గట్టుకేసి గబగబా పోతూంది.

తనపని పూర్తిచేసుకుని భయంకరంగా కూసిందిరైలు. వెనక్కీ ముందుకీ గుంజుకుంది. మహోఘనత వహించిన తన కళేబరాన్ని డాబుగా ముందుకు నడిపిస్తోంది.

'దిగు — దిగవేం!' కసిరాడు నాలోని పరిశోధక మహాశయుడు. వాడు అపరాధకుడు మాత్రం కాదు. ఉరికి రైలుతో సంబంధం తెంచుకున్నాను. ద్వారపూడి స్టేషన్ మాష్టారికి రాజమండ్రి టిక్కెట్టు ఇచ్చేశాను. అవతలిగట్టు కేసి చూపులు నిగిడ్చాను. కాళ్లీడుస్తూ నడుస్తున్నాను.

పదిగజాలు ముందుకి ముస్లిపిల్ల పురోగమించింది. కొంచం గట్టిగా నే కేక వేశాను. "ఏయ్ ! ఆగు—అమ్మాయి. నిన్నే !" నాలోని సంస్కారి సిగ్గుపడ్డాడు. 'లోకం అపార్థం చేసుకుంటుందేమో !' అనుమానించాడు నాలోని నాగరీకుడు. 'పాడులోకం ! పాడులోకం ! సంతృప్తి పడ్డాడు నాలోని సంస్కర్త !

ముస్లిపిల్ల నవ్వింది; నవ్వుతూనే ఆగింది; ఆగి అంటోంది: "ఏమండి, పిలిచారు?"

"అబ్బే ! ఏమీ లేదు" నిర్లక్ష్యంగా అన్నాను.

సందేహంతో చూస్తోంది. అసంతృప్తి కళ్ళతో ప్రశ్నిస్తోంది.

నేనూ వస్తున్నాను. కలిసి వెడదామని ఆమె సందేహం నివృత్తి చేయడానికి ప్రయత్నించాను.

"మీరెక్కడి కెడతారండి" క్రిందినుంచి మీది వరకూ చూపులు ప్రసరించాయి. ప్రశ్నించాయి.

ఏం జవాబు చెప్పరు? అవును...ఎక్కడికి వెళతాను?
ఆచిన్న మెదడును ఎందుకారాటంలో దింపాలి? అతి సహజంగా
చూస్తూఅన్నాను. "మీ ఇంటికే!" అని.

నాకు తెలుసు..మళ్ళీ ఎందుకంటుందని—ఏవిధమైన
లాభము లేకుండా వాళ్ళింటికి ఎవడొస్తాడుమరి? వింతగా
నవ్వింది; "ఇహ్హిహ్హీ! మీరెందుకువస్తారండి!మాబోటోళ్ళింటికి.
నిలదీసి అడిగింది. వేళాకోళ మనుకుంటోంది వెర్రిపిల్ల...

"కాదమ్మా! నిజమే, మీయింటికే!" దృఢంగా
చెప్పాను. నమ్మకంగా ముఖంపెట్టాను. నవ్వకుండా సీరియస్‌గా
నడుస్తున్నాను.

అనుమానంగా అడుగులు వేస్తోంది. తడబడుతూ నడు
స్తోంది. నన్నేమీ అడగలేదు. పొడుగుపాటి, బరువైన ఆలో
చనలు ఆమె మెదడుమీద అడుగులువేసి తొక్కుతున్నాయి.
సందేహంలేదు! కాళ్ళీడుస్తూ నడుస్తోంది!

* * *

"పేరేమిటమ్మాయి?" ఊసుపోక ప్రశ్నించాను.
మాట్లాడకుండా, కదిలే శవంలాగా గడపలేక ప్రశ్నించాను.
అంతే! నిజానికి ముష్టివాళ్ళకి పేర్లేమిటి?

"సత్తెమ్మండి! వినయంగా జవాబిచ్చింది.

"చూడుసత్తెమ్మా—ఇంకా ఎంతదూరం! మీయిల్లు!"
పెత్తనంగల కంఠంతో అడిగాను. నా రక్తంలో జీర్ణించిన

తాతముత్తాతల అధికారదర్పం ప్రతిధ్వనించేటట్టుగా అడిగాను.

కాని సత్తెమ్మకి కొత్తనిపించలేదు. ఆమెకి కోపం రాలేదు. తాపీగా జవాబు చెప్పింది— ''అదిగోనండి'' అంటూ చూపించింది. సరిగ్గా పదిగజాలుకూడా లేదు— దగ్గరకొచ్చేశాం గమ్యానికీ— కథకీ!

రోడ్డుప్రక్కన పల్లంలో. నిదురగన్నేరుచెట్టు నీడంలో కునుకుతున్న గుడ్డిలాంతరులాగుంది, ఆమె చూపించిన ఇల్లు; బానిసల దేశంలో దాన్ని ఇల్లే అంటారు. నిజానికది పందుల గూడు. భూమికి అడుగెత్తు మట్టిదిమ్మ— అరుగుమీద నాంచానత్తా ఐదారుగురుపిల్లలుకూర్చున్నారు. వాళ్ల ముఖాల్లో సుఖమూ, సంతృప్తీ, భావకవులకు కనిపిస్తాయి. అందరికీ మాసిన తోలుబట్టలు... అందరికీ అలంకార శూన్యత— ఆవిషయంలో మాత్రం వాళ్ళనుభవించేది 'సోషలిజమే!'.

ఇంటి గుమ్మాని కెదురుగా, కొంచెందూరంగా నన్ను విడిచిపెట్టిండి. లోపలికి వెళ్ళిపోయింది సత్తెమ్మ. గోళ్ళు కొరుక్కుంటూ అలాగే నించున్నాను. ఏమాలోచిస్తున్నానో, యిప్పుడడిగితే చెప్పలేను. కాని నాలో ఏదో కదలికమాత్రం లేకపోలేదు.

ఎర్రగా కాలిపోయిన పడమటి ప్రపంచం ప్రవహించే కాలువ నీటిలో నీడ చూచుకుంటోంది. నిదురగన్నేరుపూలు గుత్తులుగా రాలుతున్నవి. గిరగిరా తిరుగుతు కాలువనీటిలో

పడుతున్నాయి. గన్నేరుకాయి తింటూ, పారవశ్యంతో నములుతూ, నన్నూ నా ప్రపంచాన్నీ చూస్తోంది మేకపిల్ల.

ఒంటరితనంలో సిగరెట్టే శరణ్యం. అన్యథా ఆలోచించ లేదు. అగ్గిపుల్ల మంట ఆరిపోకుండా గాలికి శరీరాన్ని చాటు పెట్టాను. అంటించాను. పిచ్చిగాలి ఎగురుతూ వస్తోంది. గట్టిగా కసిగా పొగ పీలుస్తూ, మేకపిల్లను చూస్తూ నుంచు న్నాను. కాలువలోంచి వస్తున్న చల్లనిగాలులు మెడమీద కితకితలు పెడుతున్నాయి.

♦ ♦ ♦

ఎవరినో తీసుకువచ్చింది సత్తెమ్మ. బహుశా అంచనా ప్రకారం ఆమె అప్ప. వయస్సు ఇరవై యేళ్ళ లోపు. రంగులో, శరీర సౌష్టవంలో సత్తెమ్మ పోలిక; వికసించిన వయస్సు; సత్తెమ్మలోలేని ఆకర్షణ; వయస్సుకి మించిన అనుభవాల రాపిడిలో జీవితం చిట్లింది. బుగ్గలమీద, పెదాల మీద రక్కులు...స్పష్టమైన రక్తపుచీరికలు.

ఎప్పుడూ ఎరగని కొత్తవాణ్ణి. నన్నుచూసిన ఆమెలో ఏమీ చలనం కలగలేదు. అప్పుడు గ్రహించాను— నిత్యం చచ్చేవాళ్ళకి ఏడ్చేవాళ్ళెవరని!

"ఒరేయ్ లెండరా! ఎదవల్లారా!" అరుగుమీద కూర్చున్న కుర్రాళ్ళని అదిమింది. వెంటనే లేచిపోయారువాళ్లు. ఐలకపోస్తే కారిపోయే గ్లాసులోని నీళ్ళలాగ... చిరునవ్వ

కళ్ళతో నా కేసి చూసిందామె. "కలోరండి. కూర్చోండి" మర్యాదగా ఆసనం చూపించింది...భారతీయ నాగరికతకీ, సంస్కృతికీ ఎక్కడా లోటు రానీయలేదామె !

చాలాసేపు తటపటాయించింది, అలాగే చూస్తూ కూర్చున్న నన్ను గురించి అనుమానించింది. ఆఖరికి అడిగింది: "ఏమండి ఇలావచ్చారు ?"

ఆ ప్రశ్నతో నాకు ప్రాణాంతకమైంది. ఏంజవాబీయను? నిజం సంగతి చెబితే నమ్ముతుందా ?...ఇంతకీ ఆశాభంగమైతే గతేమిటి ?

చురుకుగా చూసింది. బహుశా జవాబుకోసం. ఆచూపు నావీపుమీద కొరడా కొసలా పనిచేసింది. మగవీరుణ్ణి కాబట్టి సర్దుకున్నాను.

"సత్తెమ్మ నీకు చెల్లెలా ?" అడిగాను.

"అవునండీ— ఆడు తమ్ముడు" కుర్రాణ్ణి చూపిస్తూ జవాబు చెప్పింది. మళ్ళీ మౌనం వహించాం. చొరవ తీసుకుని మళ్లీ అడిగిందామె; "ఏవూరేనా ఎల్లిపనిమీదొచ్చారాండి?" అనీ.

నిజానికి ఏంపనిమీద వచ్చాను ?—

వర్తకం పనిమీద సంతకొచ్చానంటే, ఆవేళ శనివారం నవ్వి చివాట్లు పెడుతుందేని భయం నిజం చెప్పకపోతే పీక్లేని దుస్థితి. ఆలోచించే అన్నాను:

"అచ్చే రైల్లో సత్తెమ్మ కనిపించింది. మా జీవితాల గురించి తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది. యిక్కడ దిగియిలా వచ్చాను" అన్నాను; స్పష్టమైన తెలుగుభాషలో విశద పరిచాను. కవిత్వంలో మాట్లాడలేదు. అయినా ఆమె కేమీ అర్థంకాలేదు. ఏ హిందుస్తానీ మాటలో వింటున్నట్టుంది ఆమె ముఖం. నిజమే! ఆమెకి ఎలా అర్థమవుతుంది? వాళ్ళనుగురించి తెలుసుకోవడం ఎవరికి పట్టింది? ఏం లాభమని?— ఆమెకివి సహజమైన ప్రశ్నలు. ఆఖరికి అనేసిందికూడాను.

"తెలుసుకోడానికి మాలో ఏం గొప్పఉందండి, నవ్వుతాల కంటున్నారుగాని" అని.

నేనేమీ జవాబులు చెప్పలేదు!

"అన్నం పొంగుకొస్తోంది. ఇప్పుడే వస్తానండి!" అంది. లోపలకు వెళ్ళిపోయిందామె. సత్తెమ్మకూడా తోకలా వెళ్ళింది.

*　　*　　*

లబలబలాడుతున్న అరడజను కుర్రాళ్ళేమిటో...... సత్తెమ్మ అప్రసంగతేమిటో? వీళ్ళజీవితాలు ఏ సామాజిక సూత్రానికి బంధించబడి తిరుగుతున్నాయో?... ఏమీ బోధపడలేదు. తెలీని విషయం గురించి ఎంతతీవ్రంగా యోచించినా సమాధానం రాదు. ఆమె ఇంకారాదేం చెప్మా?...

బయట చీకటికీ వెలుగుకీ బ్రహ్మాండమైనపోరాటం జరుగుతోంది. ఆఖరికి... వెలుగే ఓడిపోతోంది. చీకటి పశుబలంతో

తాత్కాలికంగా విజయం సాధించింది. అంచాతనే, చింపిరి జుత్తుతో ఆనందంగా ఆడుతూ వస్తోంది. ఆమె ఇంకా రాదేం చెప్మా?... అలాగే కూర్చున్నాను. నిరీక్షిస్తూ... యోచిస్తూ.. శోధిస్తూ...

తడిక తలుపు కిర్రుమని శబ్దం చేసింది. సత్తెమ్మ వచ్చింది. గుమ్మందగ్గర కూర్చుంది. నాకేసే చూస్తోంది. ఏదో అడుగు దామనే ప్రయత్నం కాబోలు!

"ఏం సత్తెమ్మా! మీ అప్ప పేరేమిటి?" నేనే ప్రశ్నించాను.

"మాణిక్యం అండి" సత్తెమ్మ జవాబు.

"ఆ మిగతా కుర్రాళ్ళెవరు?"

"ఎవళ్ళోనండి, మాకులాగే దిక్కూ మొక్కూ లేనోళ్ళు!"

"ఇక్కడికెలా వచ్చారు?"

"అప్పల నరసయ్య తీసుకొచ్చాడండి. మాబోటోళ్ళం దరినీ ఎతికి తీసుకొత్తాడండి' మేం అడుక్కుని డబ్బులు తెస్తాం. ఆడిజిమ్మడ! మాకు కడుపునిండా బువ్వైనా పెట్టనీడు. తాగి తందనాలాడతాడు!" సత్తెమ్మ కంఠలో పగ బుసకొట్టింది;

ఓహో! నేననుకున్నది నిజమేనన్న మాట. సరే! ఇదో ముష్టివాళ్ళ కోఆపరేటివ్ సొసైటీ—అయితే ఈ సొసైటీలో కష్టపడే వ్యక్తులందరికీ మాత్రమే ప్రతిఫలం సమానంగా

లభించదు. సంఘపరమైన శ్రమశక్తిమీద యాజమాన్యం వహించే అప్పల నరసయ్యకి 'న్యాయంగా' ప్రతిఫలంపైన ఎక్కువ అధికారం వుంటుంది! అంతే భేదం.

అధికారి అప్పలనరసయ్య నా కళ్ళముందు నిలుచు న్నాడు. బొద్దుగా, నల్లగా కండలు తేరిన దేహం; వుంగరాలు తిరిగి మెడలదాకా వేలాడే గిరజాలు; బలంగా మెలికలు తిరిగిన మీసాలు; చుట్టు చెంగాయి ఎర్రపంచ కడతాడు; బాడీ బనీన్లు వేస్తాడు; కిర్రుచెప్పులు తొడుగుతాడు, అప్పల నరసయ్య ఆకారం స్పష్టంగా ఊహించుకోగలిగాను. అయితే నా ఊహలు సరైనవో కావో పరీక్షించుకుందుకు ప్రయ త్నించలేదు, అనవసరం! మెదడు కట్లు తెంపుకు పరుగిడు తోంది. మేతపడేసి కట్టేయాలి మరి.

సత్తెమ్మ మళ్ళీ చెప్పడం ప్రారంభించింది. అసలు వూనలేదేమో!... "నేనూ మాతమ్ముడూ సిన్నోళ్ళంటండి! అప్పుడు మా అప్పతో మమ్మల్ని తీసుకొచ్చాడంట అప్పల నరసయ్య. మా అప్ప సెప్పింది" అంది అమాయకంగా.

"ఏంటండి సెబుతోంది" అంది మాణిక్యం. తడిక తలుపు తోసుకొస్తూ కిర్రుమని చప్పుడు చేసింది.

"అబ్బే ఏంలేదు. ఆ కుర్రాళ్ళ సంగతి అడిగాను. చెప్పుకొస్తూంది!" అన్నాను.

ఎవ్వరము క్షణంవరకు మాట్లాడుకోలేదు. నేను మళ్ళీ అడిగాను. "ఏం మాణిక్యం మీదసలేవూరూ? ఇక్కడికెలా వచ్చారు?" అని మార్దవంగా, కథ చెప్పమని ప్రాధేయపడు తున్నట్టుగా అడిగాను.

మాణిక్యం సినిమాలు బాగాచూసినట్టుంది. జాకెట్లలో పైట చెంగు దోపుకోవడంలో, చీర కట్టులో, పైట సర్దు కోవడంలో, నడకలో, అన్నిట్లోనూ సినిమాతారల్ని అనుక రిస్తోంది. తారల నాగరికత ఈమెకి బాగానే పట్టుబడింది.

మాణిక్యం జీవితాన్ని ఏకరువుపెట్టడం ప్రారంభించింది. అయితే మన ప్రస్తుత కథకోసంకాదు! ఆమె ఆత్మసంతృప్తికి ఆమె చెబుతోంది.

"మా బాబుకి అయినవిల్లిలో పొలముండేదండి. పెద్ద కరువురోజుల్లో ఎస్టేటుపన్ను బకాయి పెట్టేడంట. నాలుగైదే ళ్ళయినా బకాయి తీర్చలేదు. ఓనాడు ఎస్టేటు శాణేదారు గారొచ్చారు. మా పొలం జప్తు చేసి వేలాంవేశారు.

"అయ్యాల వలవలా ఏడ్చాడు మాబాబు— 'నాతల్లి పోతోందో' ఎలా బతకాలో, ఎలా పిల్లల్ని పెంచుకోనో... అంటూ ఒకటే గోలగోలగా ఏడ్చేడు మా బాబు. ఇంక మా అమ్మ... దాని సంగతి చెప్పనక్కరనేలేదు! బెంగటిల్లి పోయింది. జబ్బు పడిపోయింది". కంఠం చాలా ఇబ్బంది పడింది; మాణిక్యం ఆపింది.

ఎంత సులువుగా చెప్పింది మాణిక్యం? జమీందార్ల రైతునీ, భూమినీ విడదీయకలిగినంత తేలిగ్గా విషయాన్నంతా విప్పి చెప్పింది మాణిక్యం!

ఆమె జీవితాన్ని చెబుతూనే ఉంది; "ఎదవరోజులు! మా కయినవిల్లో గడవలేదు. మాయమ్మ జబ్బుతో మంచం బట్టేసింది. ఖళ్ళూ ఖళ్ళూ దగ్గేది. నేనప్పుడు మా సత్తిలా ఉండేదాన్ని. ఆడు పాలు తాగుతున్నాడు. మా బాబూ అమ్మా రోజూ ఏడుత్తూ కూకుండేవారు. తిరిగి తిరిగి యింటి కొచ్చేవాడు. కూలికి పొలమెక్కడా దొరికింది కాదు. 'కూనిసేయిడ మెలానే' అని ఒకటే ఏడుపు. అవ్వాళ్ళో బతకలే మనుకున్నాం. మా బాబు కాకినాడ తీసుకొచ్చేశాడు మమ్మల్ని.

"అప్పుడు కాకినాడలో పీచుకూలోళ్ళు సమ్మె కట్టారంట. అందులో పని కుదిరింది మా బాబుకి... వచ్చి నెల తిరగలేదు— కాకినాడ మా అమ్మని మింగేసింది!" మాణిక్యం గొంతు వణికింది. ఏడుపాపుకోలేకపోయింది. పైకే వినిపించింది.

వేదాంతం బోధించాను. 'ఏం శాశ్వతం?' అన్నాను. ఊరడించాను.

జీవితాన్ని ఒలకబోస్తోంది మాణిక్యం. ఖాళీ కుండ పెడతలవంటి జీవితాలవి— ఒలకపొయ్యడానికేముంది?... ఆమె చెబుతోంది: "మా అమ్మ సచ్చిపోవడంతోటే నామీద

పడింది పనంతా. మా బాబుకీ, ఆళ్ళకీ కాసిపొయ్యాడం— దేముడు పున్నెమా అని మాబాబు పల్లెత్తుమాట అనేవాడు కాడు నన్ను...

"పీచుకూలోళ్ళు సమ్మెకట్టడం మానేశారు. ఆళ్ళంతా మళ్ళీ పనుల్లోకొచ్చేశారంట. మాబాబు పని తీసేయడమా ఉంచటమా అని కంపెనీఓళ్ళు ఆలోచించారంట. కూలోళ్ళకీ మాబాబుకీ సరిపోయేదికాదు. రోజూ జగడాలేనంట. ఆఖరికి నౌఖరీలో ఉంచారు కంపెనీవోళ్ళు.

"ఏడాది గడిచింది. రోజురోజుకీ నీరసించిపోయాడు మాబాబు. ఒక్క ఏడాదిపనిచేశాడో లేదో— మా కర్మం అలాగుంది కాబోలు; యుద్ధం వచ్చింది. పీసు కంపెనీ మూసేశారంట. మా బాబుకి పనిపోయింది. పనికోసం ఎంతగా తిరిగేవాడని! — వారం పదిరోజులు కటకటలాడిపోయాం. తిండికి కూడా మొహంవాచాం. పస్తున్నాం. మళ్ళీ ఎక్కడా పని దొరికిందికాదు మా బాబుకి. ఆఖరికో రిచ్చా దొరికింది.

"దాన్ని లాక్కుంటుగా కాలం గడిపేవాడు. రోజుకో అర్ధో, ముప్పావులో తెస్తే దానితో బతికేవాళ్ళం. యుద్ధం రోజులు! బియ్యం దొరికేయిగావు. సచ్చిపోయేవాళ్ళం అంటేనమ్మండి" అంది మాణిక్యం. గుక్కతిప్పుకోడానికిలా వుంది గట్టిగా నిట్టూర్చింది. నమ్మాను. ముప్పయిలక్షల బెంగాల్ అస్తిపంజరాల ఆర్తనాదాలు నా చెవుల్లో ప్రతిధ్వనించాయి!

చెబుతూనేఉంది మాణిక్యం; "తాగోతాగకో అలాగే పనిచేసేవాడు మాబాబు. ఆరోజుల్లో రెండుమూడు సార్లు వచ్చాడు అప్పలనరసయ్య. మాబాబునడిగేవాడు కూడాను. 'ఒరేయ్, పిల్లల్ని నేతీసుకుపోతారా, పెంచి పెద్దోళ్ళనిచేస్తాను' అని. మాబాబుకి ఏదోసుట్టం అవుతాడు అప్పలనరసయ్య. 'అబ్బే' అనేవాడు మాబాబు. రాత్రిపగలూ అనకుండా ఎంత బరువేనా రిక్షాలాగుతూనే ఉండేవాడు. మాబాబు మమ్మల్ని పెంచడంకోసం! తిండి సరిగ్గా తినేవాడుకాదు. రాత్రి ఎంత చలిలోనైనా రిక్షాలోనే సినిమాకాడ తునికేవాడు. అందుకే కాబోలు రోజురోజుకీ కంపలా సిక్కిపోయాడు మాబాబు. నేననుకునేదాన్ని 'ఏరోగమైనా లోపల్లోపల తినేయటంలేదు గందా'! అని. రోజూ చూత్తునే ఉండానా, బక్కపేగులూ అడూ సిక్కిపోడం బాగానే కనిపించేది."

ఎందుకో మాణిక్యం చెప్పడం ఆపింది. కథ శిల్పంలోని బాగోగుల్ని గుర్తించి ఆపిందేమో తెలియదు. కాని మొత్తానికి కథనం ఒక్కక్షణం ఆవుచేసింది. నాకన్నుల్లోంచి దూర భూరేఖలవరకూ దృష్టి సారించింది. ఎడమచేతి కొనగోటితో పాపడిలో సున్నితంగా గోక్కుంది. పిల్లగాలులకి చెరిగి ఎగురు తున్న ముంగురుల్ని ఎడమచేత్తో సవరించుకొంది. ఆక్రీనీడలో ఎంత అందంగా కనిపించింది, మాణిక్యం!

జీవితాన్ని వినిపించడం ప్రారంభించింది మాణిక్యం. "ఓనాడు జోగుత్తూ, తూలుతూ వచ్చాడింటికి. గోని పరుచుకు

పడుకున్నాడు మాబాబు. ఆ మూల యిన్నాను ఖళ్లూ ఖళ్లూ దగ్గడం. ఆణ్ని అప్పుడే అడిగాను— ఏంబాబూ ఈయాల ఇంటికి కొచ్చేశావ్ !' అని. 'ఏంలేదమ్మా పడుకో' అన్నాడు అంతే. అంతకన్నా ఏం చెప్పేడు కాడు నాకు. మళ్లీ దగ్గాడు మాబాబు అచ్చంగా మాఅమ్మలాగే! 'మాయదగ్గు ఈన్నికూడా మింగే యదుగందా, మాయమ్మలాగ' అనుకున్నాను."

చెప్పడం ఆపింది మానిక్యం. నాకు తెలుసు తర్వాత ఏం చెబుతుందో! బానిసల దేశంలో వాళ్ళ జీవిత జ్యోతిష్యం నాకు బాగా తెలుసు— అంచాతనే త్వరగా చెప్పమని ఆరాట పడలేదు!

పాపం! మానిక్యానికి తెలీదు— ఆళ్ళ బాబుకేం జబ్బు పట్టుకుందో... నూటికి యిరవై మందికి పట్టుకునే పాడుజబ్బు! సరైన తిండిలేక, కావలసినంతవిశ్రాంతిలేక, తీరుబడీ సుఖమూ ఆనందాల విషయం తెలియకపోవటంవల్ల సంక్రమించే పాపిష్టి జబ్బు!— అదే ఆళ్ళబాబుకి పట్టుకుంది. పట్టుకోక ఏం చేస్తుంది? కోవ్వెక్కిన కోటీశ్వరులకైతే దగ్గరకు రాదది... వచ్చినా నిమిషంలో వదిలించుకోనేశక్తి, కలవారికుంది... కాని మానిక్యం బాబుకి పట్టుకున్న జబ్బు ఎలా వదులుతుంది? వాడికేగాదు పేదవాళ్ళందరికీ వస్తుంది... అందరు రిక్షావాళ్ళకీ వస్తుంది.

ఆలోచనల్లో పూర్తిగా మునిగి తపతప కొట్టుకుంటు న్నాను. గుటకలు మింగుతున్నాను; శూన్యంగా చూస్తూ, ఊహల్లో పరియత్నిస్తూ...

మాణిక్యం చెబుతోంది మళ్ళీ. ఉచ్ఛ్వాస నిశ్వాసాల కున్న అంతరంలాగ ప్రారంభాంతాల వ్యత్యాసంకూడ బహు స్వల్పం..."మాబాబు బొత్తిగా రిచ్చాలాగలేక పోయేవాడు. రోజుకో ఆరణాలు రావడంకూడా కష్టమైపోయింది. ఆరణాల డబ్బుల్తో నలుగురుమి ఎలాబతకం?" ఆమె అతిసాధారణంగా అంది. అయితే ఆప్రశ్న నన్ను నిలేసి సవాల్ చేసింది. గాంధీజీ చెప్పినవిషయం జ్ఞాపకం వచ్చిందినాకు. 'భారతదేశంలో సగటు మానవుడి దైనిక జీవితం వెరసి ఐదుకాన్ల ఖరీదు కాబట్టి జీవితా వసరాలకోసం అంతకన్న ఎక్కువఖర్చు చేయడం ద్రోహం!' అని.

మాణిక్యం జీవితకథ వింటున్నంతసేపూ నా మెదడులో మెదులుతున్న బలమైన ఆలోచన ఒక్కటే! భూస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థలను పునాదితో కూల్చి, సమగ్రంగా మార్చాలనే స్వాప్నికుల మాటలెంత సార్థకాలో కదా, అని!

* * *

"మా బాబుకి రోగం హెచ్చిపోయింది"—మాణిక్యం చెబుతూనేఉంది. "ఇంకో నెల్లాళ్ళకి కాకినాడలో బాంబులు పడతాయనగా మాబాబు సచ్చిపోయాడు. మమ్మల్ని దిక్కూ మొక్కూ లేనోళ్ళనిచేసి సచ్చిపోయాడు. మా బాబు సచ్చి

పోతూ అప్పలనరసయ్యకి అప్పగించాడు మమ్మల్ని...'నువ్వు తప్ప ఈళ్ళకి దిక్కెవరూ లేర్రోయ్, ఎలాచూత్తావో' అన్నాడు మా బాబు. అంతే మాబాబుని కాకినాడలో మట్టిచేశాం. అప్పలనరసయ్యతో యిక్కడికి వచ్చేశాం. నేనూ సత్తెమ్మా తమ్ముడూ కలసి..."

బండిలా ఆగింది మాణిక్యం. తన దుఃఖపుబరువులు దింపుకుంది మాణిక్యం. అప్పుడు తెలిసిందినాకు: మాణిక్యం జీవిత కథా సంవిధానంలో మరోమజిలీ పూర్తికావచ్చింది అని.

"నేను పెద్దమనిషి నయిందాకా మా సత్తిలాగే రైళ్లో అడుక్కుని తెచ్చేదాన్ని. దానితో మమ్మల్ని పోషించేవాడు అప్పలనరసయ్య. మాకు లాంటోళ్ళనే మరో యిద్దరు ముగ్గుర్ని సంపాయించాడు. అందర్నీ యిలాగే అడుక్కోడానికి పంపేవాడు. నాకంటె పెద్దదొకర్తె ఉండేది. అది పెద్దమనిషి అవగానే దాన్ని పాడుచేశేడీ యెదవ సచ్చినోడు! అదిప్పుడు రాజమండ్రిలో ఉంటోంది. ఆడ కుర్రది పెద్దదవగానే దాన్ని పాడుసేయడం, యభిసారంలోకి దింపేయ్యడం అదీ ఆడిపని. ముండాపోషించడం ఇలా చేత్తాడని తెలిస్తే మాబాబు మమ్మల్ని యీడికి ఇచ్చేవాడా?" బరువుగా నిట్టూర్చి శూన్యంలోకి చూస్తూ ప్రశ్నించింది మానిక్యం.

సత్తెమ్మ కళ్ళల్లో సముద్రాలు ఘోషిస్తున్నాయి. భువనాలామె నుదుటిరేఖల్లో కంపిస్తున్నాయి. అదోలాగ

చూస్తోంది సత్తెమ్మ. లేడి కళ్ళు భయపడుతున్నాయి.

సత్తెమ్మని చూసి మాణిక్యం అంటోంది: "కంచాల్లో వాటాలేసి పెట్టేశాను. అంతా ఎల్లి తిళ్ళు తినండ్రా" అని. లజలబలాడుతూ అంతా లోపలికి పోయారు కుర్రాళ్ళు. కాని సత్తెమ్మ మాత్రం మరోకసురు కసిరేదాకా అలానే నిలబడింది.

బాగా చీకటి పడుతోంది. పిట్టలకలవరం సద్దుమణిగింది. మాణిక్యం జీవిత మహాభారతంలోని ఆఖరి ఆశ్వాసాన్ని పూర్తి చేయడానికి గొంతు సవరించుకొంది.

"దిక్కూ మొక్కూ లేని కుర్రాళ్ళందర్నీ ఏరుకొత్తాడు. నాదగ్గరో ఆరుగుర్నీ. రాజమండ్రీదాని దగ్గరో అయిదుగుర్నీ యిలాగే పెట్టాడీ సచ్చినోడు; అక్కడ కొన్నాళ్ళుగడిపేస్తాడు రోజులు... మేం ప్రతీసచ్చినోడి దగ్గరా తొంగుని ఒళ్ళంతా హూనం చేసుకోవాల! యింతా సత్తే ఎదవ రూపాయిడబ్బులు పారేత్తారు. ఈడబ్బంతా ఆడి ఎదాన్ని కొట్టాలి. యెదవ నంజకొడుకు తెగతాగి గంతులేత్తాడు. ఆడి మాటకి అడ్డు సెబితే సాలు, ఒళ్ళంతా ముక్కలవాల్సిందే!" అంది మాణిక్యం.

తన జీవితం ఎంత పాడయిందో, ఎంతలోతు ఊబిలో మునిగి కూరుకుపోయిందో చూసుకుంటోంది; మాణిక్యం గొంతు బొంగురుపోయింది.

"చూడు మానిక్యం — కష్టాలెల్లకాలం కాపురం చేయవు. నిజమే! మన తాతముత్తాతలనుంచీ కష్టాల్లోనే మునిగిపోయాం. అయితే ముందురోజుల్లో కూడా ఇలాగే ఉంటుందనుకోకు! నిరాశలో మునిగిపోకూడదంతే" గంభీరంగా అన్నాను. ఎలాగోలాగ ఆమెకి జీవితంమీద నమ్మకం కలగాలి. కష్టాలు పోతాయనే ఆశను రగిలించాలి! తీవ్రంగా ప్రయత్నించాను.

కాని..సుఖం, ఆనందం, భగ్గున మండిపోయిన వల్లకాడు లాంటి జీవితం... ఆమెకి విశ్వాసం ఎలా కలుగుతుంది?... నిజమే— తల్లి చచ్చిపోయింది... తండ్రి చచ్చిపోయాడు... నమ్మి జీవితాల్ని అప్పగించిన అప్పలనరసయ్య రాక్షసావతార మెత్తాడు... ఏ ఆశ చూసుకుని సంతృప్తి చెందుతుందామె? తాను చేసిన ఏ అపరాధంవల్ల ఇన్నిబాధలకీ లోనుకావలసి వస్తోంది?. ఏమో తనకి తెలీదు! ఏజన్మలో చేసిన పాపాలివి? తనకి సమాధానం రాదు.

ఒక్క విషయం మాత్రం విస్పష్టంగా తెలుసు మానిక్యానికి— రేపోమాపో ఈడారబోయే తన చెల్లెలికీ తన గతే పడుతుందని! ఆ విషయం తల్చుకుంటే రక్తసంబంధంతో నిండిన ఆమెగుండె కొడిగట్టుతుంది. రంపంకోతలు బుసగొడు తున్నాయి.

లోకమంతటా చీకటి ఆవరించింది. కాలువలో తెరచాప విప్పుకొన్న పడవ నిశ్చింతగా కడుపులో చల్ల కదలకుండా

ప్రయాణం సాగిస్తోంది. ఇవాళనుంచి రేపటికి ప్రయాణం సాగిస్తోంది. ఇవాళనుంచి రేపటికి ప్రయాణం సాగించడానికి రాత్రి ఒక వంతెన కాబోలు.

తడిక తలుపు చిల్లులోంచి సూదుల్లాంటి కన్నులతో చూస్తోంది లోపలి దీపపు సెమ్మా. దీపం కాంతులు తడిసిన మాణిక్యం చెంపలో నీడ చూసుకుంటున్నాయి!

పాపం మాణిక్యం ఏడుస్తోంది. ఆకాశంలో నక్షత్రాలు లోపలిదీపం సెమ్మాకూడా సాక్షమిస్తున్నాయి. అందు చేతనే, అనునయించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాను.

ఆమె నా దగ్గరగా జరిగింది. కంఠంలో మార్దవం ఆప్యాయతా స్ఫుటమయ్యేట్టుగా అంటోంది: "ఎవరికిపట్టింది బాబూ! మా మొదవ బ్రతుకులమీద దయకలగడానికి ఎవరో మీబోటి మారాజులికితప్ప!" అంది మాణిక్యం. జీవితపు లోతుల్నుంచి మూగకంఠం ప్రతిధ్వనించింది. నిరాశకు బంధించబడి పరిభ్రమించే తన గానుగెద్దుబ్రతుకుని అసహ్యించుకుంది. తనచుట్టూ ఉన్న సమాజంనుంచి కొద్దిపాటి దయకూడా పొందని అనుభవాల కైనారంనుంచి వెలువడిన అసహాయపు గొంతుతో అన్నది మాణిక్యం!

"చూడు మాణిక్యం...ఈపరిస్థితులు ఇలాగే ఎన్నాళ్లున్నా నీ బ్రతుకు నీచంగానే ఉంటుంది. నాకు తెలుసు; కాని ఈ పరిస్థితి ఎన్నాళ్ళో వుండదిలా...త్వరలోనే మారుతుంది.

చూడమ్మా! నామాట నమ్మ...మార్చే ప్రయత్నాలు వడి వడిగా జరుగుతున్నాయి!" అన్నాను. ఉపన్యాస వేదికనుంచి, నమ్మిన సత్యాన్ని ఘంటాపథంగా వెల్లడించే రాజకీయ వాదిలా ముఖం తిప్పుతూ.

'పేదల జీవితం అట్టడుక్కి తనవిమవుప్రవేళ్ళను నాటుకుని ఈ అసమవ్యవస్థ పెరిగింది. దీన్ని సమూలంగా నాశనం చేయడం మానవుల విద్యుక్త ధర్మం' అనే విశ్వాసం గొంతులో నిబిడీభూతమయ్యేట్టుగా ఆమెతో చెప్పాను.

ఏం చెప్పినా ఒకటే! ఆమె ఎలా నమ్మగలుగుతుంది? నేను చూపిన బంగారుకాంతుల ప్రపంచాన్ని ఆమె ఎలా ఊహించగలుగుతుంది?

బాగా దగ్గరగా జరిగింది మాణిక్యం. నామీద చేతులు వేసింది. నా చేతుల్ని తన ఒడిలోకి లాక్కుంది.

ఇంక ఆట్టేకాలం అక్కడ వుండకూడదని నిర్ణయించుకొన్నాను. అయితే ఎలా ఉబ్బెత్తుగా కాదని లేచిపోవడం? ఆలోచిస్తూ కూర్చున్నాను. వ్యక్తావ్యక్తాల నడుమ తారట్లాడుతున్న మనస్సుతో కూర్చున్నాను.

"మీ జేయూరండీ!" అడిగిందామె. నిజాని కేవ్వూరైనా ఆమెకి అవసరంలేదు. తనమీద పనున్న ఎవడేనా ఎక్కణ్ణుంచి వచ్చి అడిగినా ఆమెకి అభ్యంతరంలేదు. కాని నన్నిలా ఎందుకడిగిందామె?

ఆమె దగ్గరికి చాలమంది మంచివాళ్ళు వచ్చారు. తమ అవసరం తీర్చుకున్నారు. వెళ్ళిపోయారు. అంతే! 'ఎలా వున్నావు? తిన్నావా లేదా?" అనే ప్రశ్నలేమీ వాళ్ళని ఇబ్బందిపెట్టవు. కేవలం నిమిత్తమాత్రులు వాళ్ళు. వస్తారు— ఆమెని హూనంచేస్తారు. వచ్చినదోవనే బట్టలుదులుపుకుంటూ వెళ్ళిపోతారు. ఆమె గొడవ ఎవరిక్కావాలి?

ఆ దుర్భరజీవితంమీద మాటవరసకి సానుభూతిచూపిన వాళ్ళలో నేనే మొదటివాణ్ని కాబోలు! అందుచాతనే నాకింత ఆత్మీయత, ఆప్యాయత పంచిపెట్టిందామె!

ఆమె ప్రశ్నలన్నిటికీ శ్రద్ధగా సమాధానమిచ్చాను.

"రాత్రికి ఇక్కడే పడుకోండి!" అందామె ఆఖరికి మామూలుగా. అతిసాధారణంగా అంది.

కాని నా బుర్ర గిరగిర తిరగడం ప్రారంభించింది. సమాధానం తోచలేదు. తటపటాయించాను. తమాయించు కొన్నాను. ఆఖరికి గొంతు పెగిలింది మెల్లిగా.

"అవసరం లేదమ్మా— నేవెళ్ళిపోతా; యిదిగో దీన్ని తీసుకో" అన్నాను. జార్జిరాజు సాక్షిగా ఐదురూపాయల కాగి తం చేతిలో పెట్టాను. రెప్పవాల్చకుండా చూసింది మాణిక్యం. తనచేతికీ, నాముఖానికి ప్రయాణిస్తున్నాయి ఆమెచూపులు. చాలా సిగ్గుపడుతున్నాయి ఆమె చూపులు. స్వాభిమానంతో

ఒణుకుతున్నాయి పెదవులు. ఎందుకుతీసుకోవాలని ప్రశ్నించు కుంటున్నాయి ఆమె చెంపలు!

"అక్కర్లేదండి!" అందామె.

"ఫర్వాలేదు మాణిక్యం నీదగ్గరుంచుకో!" అన్నాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. ఆత్మబంధువుని చూసినట్టు చూసింది నన్ను. నేను డబ్బుఇవ్వటంవల్ల కాదని మాత్రం నాకు తెలుసు.

"వెళ్ళొస్తాను మాణిక్యం" అన్నాను.

"మిమ్మల్ని బతిమాలుకుంటున్నాను ఈ రాత్రికి ఉండి వెళ్ళండి!" అందామె. మాణిక్యం కంఠం మరోలోకంలో ప్రతిధ్వనించింది.

"అవసరంలేదమ్మా.. వెళ్లొస్తా మాణిక్యం!" అన్నాను.

వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నాను. ఆమె... ఇంకా అక్కడే... తడికె తలుపుపట్టుకుని అలాగే... నా అడు గులు చూస్తూ నించుని వుంటుంది. నాకు తెలుసు! అయినా వెనక్కితిరిగి చూడలేదు.

ఎక్కడికి వెడుతున్నాను? ఆవూళ్లో అంతకన్నా ఆప్తు లెవరున్నారు? — ఆవూరు ముక్కూ మొహం ఎరుగను.

చిన్నగా నడిచాను. బరువుగా అడుగులువేస్తూ ఏదో పొరవేసుకున్నపాని వెర్రిచూపులతో కాఫీహోటలు పాక

కనిపించేదాకా నడిచాను. మంచినీళ్ళు తాగాను... రామ కోవిల అరుగుమీద, నేల దులుపుకున్నాను. తువ్వాలు పరుచుకుని తలకింద సంచిపెట్టుకుని పడుకున్నాను.

ఎంత సేపాలోచించానో, ఏమి టాలోచించానో, ఎప్పుడు కునుకుపట్టిందో— ఏమీ తెలియదు.

కోట్టుజవాన్ నా పేరెట్టి కేకవేయడం స్పష్టంగా వినిపించింది. నిద్రలో ఉలిక్కిపడ్డాను. తెల్లవారిపోయిందేమో అని భయపడ్డాను.

చీకటీ చలీ జటపటాలు వేసుకుని లోకంమీద చిందులు తొక్కుతూ కవాతుచేస్తూ, మానవుల్ని పరిపాలిస్తున్నాయి. దూరాన్నుంచి, చేలల్లో నక్కలు భీకరంగా అరుస్తున్నాయి.

చుట్టుపట్ల నరసంచారంలేదు. రామకోవిల అరుగుమీద మాత్రం నావంటి అభాగ్యుడింకొకడు దుప్పటి కప్పుకుని గుర్రుపెడుతున్నాడు. ఎంత తాపత్రయపడినా నిద్రపట్టింది కాదు.

'ఎందుకు తెచ్చుకున్నానురా భగవాన్ ఈ అవస్థ?' ప్రశ్నించుకున్నాను. రామకోవిల చచ్చిన ఏనుగుకళేబరంలా నిద్రపోతోంది. నాకు సమాధానంలా మరింత చలిగాలివీచింది.

'హాయిగా, ఆప్తంగా, తీయగా మాణిక్యంతో గడప

కూడదీ రాత్రి!' నన్నుచూసి నేనే జాలిపడ్డాను. నన్ను నేనే అసహ్యించుకున్నాను... ఆమె జీవితానికి తీపి ఎక్కణ్నించి వస్తుంది?

'బానిసలు మానవులుగామారే వ్యవస్థ వచ్చితీరాలి!' అని దృఢంగా సంకల్పించుకున్నాను. అలాగే......ఆ మహా సంకల్పంతోనే, చలితో, చీకటిలో, తీవ్రాతి తీవ్రంగా గడిపాను.

కోటి కాంతుల ఎరుపుతో, బంగారుకలల ఆశలతో మరోప్రపంచంలా తూరుపు వికసించింది. వెచ్చగా, హాయిగా కాంతివంతంగా తెల్లవారింది.

★